క్లుప్తంగా

బర్డ్‌ఫ్లూ ఉందనేది అవాస్తవం

- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు
- డాక్టర్ వినోద్‌కుమార్ సూచన



కోళ్ల ఫారంను పరిశీలిస్తున్న డాక్టర్ వినోద్‌కుమార్

కొమరోలు: జిల్లాలో బర్డ్‌ఫ్లూ వైరస్ లేదని, ప్రజలు ఆందోళన చెందవద్దని కొమరోలు పశువైద్యశాల వైద్యాధికారి డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని పొట్టిరెడ్డిపల్లె గ్రామంలో తమ సిబ్బందితో కలిసి గురువారం పౌల్ట్రీ ఫారాలను పరిశీలించారు. యజమానులకు తగు సూచనలు చేశారు. డాక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో బర్డ్‌ఫ్లూ ఉందని సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. నిర్భయంగా కోడిగుడ్డు, కోడి మాంసం తినవచ్చని స్పష్టం చేశారు.

అర్హులకే కార్పొరేషన్ రుణాలు



యూనిట్‌ను పరిశీలిస్తున్న బీసీ కార్పొరేషన్ ఈడీ

బేస్తవారిపేట: అర్హులకే కార్పొరేషన్ రుణాలు మంజూరు చేస్తామని బీసీ కార్పొరేషన్ ఈడీ ఎం వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక బీసీకాలనీ, పాత ఇంజినీరింగ్ ఆఫీసు, గాంధీ బజార్ వీధుల్లో బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు కార్పొరేషన్ రుణాల పంపిణీని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. లబ్ధిదారులు తప్పనిసరిగా యూనిట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి



కొనకనమిట్లలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

కొనకనమిట్ల: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సమస్యల పరిష్కారానికి సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని డీఎల్‌పీఓ ఎస్‌వీఎల్ హనుమంతరావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని తువ్వపాడు, రేగుమానిపల్లి గ్రామాల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఆయా కేంద్రాలను పూర్తి వినియోగంలోకి తెచ్చి వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని సూచించారు. పారిశుధ్య పనులను పర్యవేక్షించాలని కార్యదర్శులకు సూచించారు. అనంతరం కొనకనమిట్లలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయన వెంట ఈఓఆర్డీ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

మార్కింగ్ దాటితే చర్యలు తప్పవు



మార్కింగ్ వేయిస్తున్న పోలీసులు

కంభం: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండులో అధికారులు వేసిన మార్కింగ్ దాటి ముందుకు వస్తే చర్యలు తప్పవని సీఐ మల్లికార్జున హెచ్చరించారు. గురువారం పంచాయతీ అధికారులతో కలిసి బస్టాండ్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాల ముందు మార్కింగ్ వేయించారు. పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలకు సహకరించాలని వ్యాపారులను కోరారు. మార్కింగ్ లైన్ లోపలే వ్యాపారాలు చేసుకోవాలని, వాహనాలు సైతం లోపలికి ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై నరసింహారావు, పంచాయతీ కార్యదర్శి రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌కు వంద అర్జీలు

రాచర్ల: మండల కేంద్రమైన రాచర్లలోని బీసీ కార్పొరేషన్ భవనంలో గురువారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు 100 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ఎల్.వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. అత్యధికంగా రెవెన్యూ, తాగునీటి సమస్య, చెక్‌డ్యామ్, విద్యుత్ స్తంభాల మరమ్మతులపై అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ భారతిబాయ్, ఎంఈవోలు కోటేశ్వరరావు, వారణాసి గిరిధర్ శర్మ, వ్యవసాయాధికారి షేక్.మహబుబ్‌బాషా, ఏపీఎం రమేష్‌బాబు, ఎస్సై పి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

- మార్కాపురంలో బహిరంగ టాయిలెట్ల నిర్వహణ గాలికి..
- కూరగాయల మార్కెట్ వద్ద నిరుపయోగంగా మరుగుదొడ్లు
- ఆర్టీసీ డిపోలో దారుణంగా తయారైన యూరినల్స్
- చాటు దొరికితే చాలు గోడలు తడిపేసే పరిస్థితి
- బహిరంగ మల, మూత్ర విసర్జన నిషేధం కాగితాలకే పరిమితం



ఆర్టీసీ బస్టాండ్‌లో కంపు కొడుతున్న యూరినల్స్

అమ్మో ఒకటీ.. రెండు.. బాధలు కాదు!

మార్కాపురం టౌన్:

కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో బహిరంగ టాయిలెట్ల నిర్వహణను మున్సిపల్ అధికారులు గాలికొదిలేశారు. కంపు కొడుతున్న టాయిలెట్లలో ప్రజలు ముక్కు మూసుకుని సర్దుకోక తప్పని దుస్థితి. మార్కాపురం పట్టణంలో బహిరంగా మలమూత్ర విసర్జనపై నిషేధం విధించి, వివిధ శాఖల అధికారులు, మెప్మా మహిళలతో తీర్మానం చేయించిన మున్సిపల్ యంత్రాంగం సాధించింది శూన్యం. స్వచ్ఛ సర్వేక్షణ్–2024లో మార్కాపురం పురపాలక సంఘానికి మెరుగైన ర్యాంకు తీసుకురావాలని నిర్ణయించిన అధికారులు ఆ దిశగా ఇప్పటికీ అడుగులు వేయకపోవడం గమనార్హం. సరిగ్గా రెండు నెలల క్రితం ‘ఇచ్చట కాదు.. మరెచ్చట’ శీర్షికన టాయిలెట్ల తీరుపై ‘సాక్షి’లో ప్రచురించిన



సప్తగిరి లాడ్జి వద్ద టాయిలెట్ ఇలా..



కూరగాయల మార్కెట్ వద్ద ఉన్న టాయిలెట్ దుస్థితి

కథనానికి స్పందించిన మున్సిపల్ అధికారులు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ సెక్రటరీలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. అయినప్పటికీ టాయిలెట్ల పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. పట్టణ ప్రజలతోపాటు డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారు అత్యవసర సమయాల్లో వినియోగించుకునేందుకు మరుగుదొడ్లు ఏర్పాటు చేయకుండా ర్యాంకుల కోసం ప్రయత్నించడం హాస్యాస్పదంగా ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మార్కాపురం పట్టణంలో సుమారు 90 వేల మంది జనాభా ఉన్నారు. వివిధ అవసరాల నిమిత్తం మార్కాపురానికి రోజూ పది వేల మందికి పైగా జనాభా వస్తుంటారు. శ్రీశైలం, త్రిపురాంతకం, వెలుగొండ వెంకటేశ్వర స్వామి తదితర పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులు మార్కాపురం మీదుగానే ప్రయాణం సాగిస్తారు. ముఖ్యంగా కూరగాయల మార్కెట్‌లో వ్యాపారులు, కూలీలు అర్ధరాత్రి నుంచే పనిచేస్తుంటారు. ఉదయం నుంచి పట్టణ ప్రజలతో పాటు కూరగాయల కోసం ఇతర ప్రాంతాల ప్రజలు, మహిళలు వందలాదిగా వస్తారు. అయితే పట్టణంలో అక్కడక్కడా ఏర్పాటు చేసిన టాయిలెట్లు నిరుపయోగంగా మారడంతో ప్రజలంతా కాలకృత్యాలు తీర్చుకునే మార్గం లేక ఉగ్గబట్టుకోవాల్సిన పరిస్థితి.

ఇదీ టాయిలెట్ల దుస్థితి

మార్కాపురం పురపాలక సంఘం పరిధిలో పే అండ్ యూజ్ టాయిలెట్లు 3 ఉండగా, పురపాలక సంఘం పరిధిలో కొన్నేళ్ల కిందట పట్టణంలోని సప్తగిరి లాడ్జి కూరగాయల మార్కెట్, కోర్టు సెంటర్, పాత బస్టాండ్‌లో అదనంగా టాయిలెట్లు ఏర్పాటు చేశారు. అయితే వీటికి నీటి సౌకర్యం లేక దుర్వాసన వస్తుండటంతో పురుషులు వినియోగించుకునేందుకు విముఖత చూపుతూ గోడలు, వాహనాల చాటున కాలకృత్యాలు తీర్చుకోవడం ప్రారంభించారు. కేవలం ఉదయం వేళ ఒకసారి శుభ్రం చేసి వదిలేస్తుండటంతో ముక్కు మూసుకుని పోవాల్సిన అగత్యం ఏర్పడింది. ఇక పాత బస్టాండ్‌లో పే అండ్ యూజ్ టాయిలెంట్ ఉండగా చెన్నకేశవ స్వామి గాలిగోపురం నిర్మాణ సమయంలో తొలగించారు. కోర్టు సెంటర్‌లో ఉన్న పురపాలక సంఘం టాయిలెట్‌ను 2024 ఎన్నికల సమయంలో అడ్డుగా ఉందని అధికారులు తొలగించారు. జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో టాయిలెట్లు లేక, ఉన్నవాటి నిర్వహణ కూడా సక్రమంగా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో స్వచ్ఛత ర్యాంకులు ఎలా సాధ్యమో అధికారులకే తెలియాలి.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలి



ఆదిమూలపు సురేష్, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని సత్కరిస్తున్న కేవీ రమణారెడ్డి

- కేవీ రమణారెడ్డికి ఎమ్మెల్యే బూచేపల్లి, ఆదిమూలపు సురేష్ సూచన

పొదిలి రూరల్: క్షేత్ర స్థాయిలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కేవీ రమణారెడ్డికి దర్శి ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ సూచించారు. ప్రజా సమస్యలపై స్పందించి బాధితులకు అండగా నిలవాలని చెప్పారు. గురువారం పొదిలి మండలంలోని బట్టువారిపల్లె సమీపంలో ఇరువురు నేతలను కేవీ రమణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గొలమారి చెన్నారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అన్నాను సన్మానిస్తున్న కేవీ రమణారెడ్డి

అన్నా, కేపీతో భేటీ

మార్కాపురం: జిల్లాతోపాటు మార్కాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కేవీ రమణారెడ్డికి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు సూచించారు. గురువారం అన్నా రాంబాబును మార్కాపురంలోని ఆయన నివాసంలో కేవీ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉండాలని అన్నా సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కంభం ఏఎంసీ మాజీ చైర్మన్ వైవీ రావు, పాములపాడు సర్పంచ్ కోదండ రామిరెడ్డి, మంగాపురం సర్పంచ్ ప్రకాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం గిద్దలూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని కలిసి సన్మానించారు.

పశు వైద్య సిబ్బందిపై జేడీ ఆగ్రహం

పొదిలి రూరల్: మూగజీవాలకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ కె.బేబీరాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల సిబ్బందితో పశుగణన, ఆరోగ్య సంరక్షణ ప్రగతిపై జేడీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ‘చిన్న వయసులో ఉద్యోగంలోకి వచ్చారు. మూగ జీవాలకు వైద్యం చేసి ప్రజలు మన్ననలు పొందాల్సింది పోయి బాధ్యత లేకుండా వ్యవహరిస్తారా’ అంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయాల వారీగా ప్రగతి నివేదిక 0 నుంచి 6 శాతమే ఉండటంతో తీవ్ర అసహనం వ్యక్తం



సమీక్షలో మాట్లాడుతున్న జేడీ బేబీరాణి

చేశారు. ఇకపై ర్యాండమ్‌గా తనిఖీలు నిర్వహిస్తానని, సెన్సస్ సర్వే రెండు రోజుల్లో పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. జిల్లాలో బర్డ్ ఫ్లూ లేదని, సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. సమావేశంలో మూడు మండలాల సచివాలయాల పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

- డీవైఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మావతి

మార్కాపురం: ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యాలు అనుమతి లేకుండా స్కానింగ్ సెంటర్లు నిర్వహించినా, లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని మార్కాపురం డీవైఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మావతి హెచ్చరించారు. గురువారం పట్టణంలోని 5 ప్రైవేట్ ఆస్పత్రులను ఆమె ఒంగోలు డీఎంహెచ్‌ఓ కార్యాలయ ప్రతినిధి శ్రీనివారావుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లకు పలు సూచనలు చేశారు. ఎంత ఒత్తిడి చేసినా లింగ నిర్ధారణ పరీక్షలు చేయవద్దని స్పష్టం చేశారు.



స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న డాక్టర్ పద్మావతి, సిబ్బంది

అత్యుత్తమ ఫలితాలు సాధించండి

- మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి

మార్కాపురం టౌన్: అత్యుత్తమ ఫలితాలు సాధించి మార్కాపురానికి మంచి పేరు తేవాలని విద్యార్థినులకు మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని రెడ్డి మహిళా కళాశాలలో వీడ్కోలు సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గత 40 ఏళ్లుగా ఎంతో మంది పేద, మధ్య తరగతి విద్యార్థినులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడం గొప్ప విషయమన్నారు. దూర ప్రాంత విద్యార్థినులకు కళాశాల ఆవరణలోనే హాస్టల్ వసతి కల్పించడం అభినందనీయమన్నారు. మంచి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం గతేడాది మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భారతమ్మ, ఇంటర్మీడియెట్ ప్రిన్సిపాల్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జంకె వెంకటరెడ్డి

చిత్తశుద్ధి ఉంటే వెలిగొండకు నిధులివ్వండి



మార్కాపురం : ధర్నాలో పాల్గొన్న నిర్వాసిత గ్రామాల ప్రజలు, నాయకులు



పొదిలిలో ధర్నా చేస్తున్న రైతు, కార్మిక సంఘం నాయకులు



కంభంలో తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

- రైతు, ప్రజా సంఘాల డిమాండ్

మార్కాపురం: రాష్ట్ర బడ్జెట్‌లో వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జయంతి బాబు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వానికి వెలిగొండ ప్రాజెక్టు చాలా చిన్న విషయమని, చిత్తశుద్ధితో పూర్తి చేయాలని కోరారు. బడ్జెట్‌లో వెలిగొండకు నిధులు ఇవ్వకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిర్వాసితులకు ఆర్అర్ ప్యాకేజీ వెంటనే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జి.బాలనాగయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రూబెన్, నిర్వాసిత గ్రామ నాయకులు వెంకటేశ్వర్లు, లక్ష్మీరెడ్డి, అడివయ్య, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొదిలి: పశ్చిమ ప్రాంత వరప్రదాయని వెలిగొండ ప్రాజక్టు మిగులు పనులు పూర్తి చేయడానికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పి.హనుమంతరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు, కార్మిక సంఘాల పిలుపు మేరకు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.రమేష్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భాయన మాట్లాడుతూ.. వెలిగొండ ప్రాజక్టు నిర్మాణంలో ప్రభుత్వం అశ్రద్ధ చేయడం సరికాదన్నారు. ఓట్లు దండుకోవడానికి ప్రాజెక్టు పేరు చెప్పడం కాకుండా చిత్తశుద్ధితో పూర్తి చేసి వినియోగంలోకి తేవాలన్నారు. ఎం.రమేష్ మాట్లాడుతూ నాగార్జున సాగర్ రెండో దశ పేరుతో పొదిలి ప్రాంతానికి మరొక అన్యాయం జరుగుతోందన్నారు. వెలిగొండ ప్రాజక్టు పరిధిలోకి పొదిలి మండలం మొత్తాన్ని చేర్చాలన్నారు. పొదిలికి తాగు నీరు, సాగు నీరు అందించేలా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలన్నారు. నిధులు కేటాయింకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఎన్.వెంకటేశ్వరరెడ్డి, కె.పేరిరెడ్డి, బి.శ్రీనివాసులు, కె.శేషగిరి, టి.నరసయ్య, సీఐటీయూ నాయకులు బి.కోటేశ్వరరావు, ఆర్.తిరుపతయ్య, చెన్నకేశవులు, సుబ్బయ్య, పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.బాదుల్లా, ఎస్‌కే మదార్‌వలి తదితరులు పాల్గొన్నారు.

కొమరోలు: వెలిగొండ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఎం మండల నాయకురాలు పోసాని అంజమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం తహసిల్దార్ భాగ్యలక్ష్మికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు రామరాజు మాట్లాడుతూ.. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే పశ్చిమ ప్రకాశం రైతులు అభివృద్ధి చెందుతారని, వేగంగా పనులు పూర్తి చేయాలని కోరారు. నిర్వాసితులకు ఆర్అర్ ప్యాకేజ్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

కొనకనమిట్ల: వెలిగొండ ప్రాజెక్ట్‌కు మొదటి టన్నెల్ ద్వారా నీరు విడుదల చేయాలని రైతు సంఘం నాయకులు అబ్బూరి వెంకటేశ్వర్లు, పి.కొండయ్య, బాలనరసయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రం కొనకనమిట్లలో వెలిగొండ ప్రాజెక్ట్ ప్రాధాన్యతను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. తాగు, సాగు నీటి సమస్య శాశ్వత పరిష్కారం వెలిగొండ ప్రాజెక్ట్‌తోనే సాధ్యమన్నారు. అనంతరం తహసీల్దార్ ఆవుల సురేష్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆరికట్ల శ్రీనివాసులు, వెంకటసుబ్బయ్య, పండిటి ఏసేబు, శ్రీను, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కంభం: వెలిగొండ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరుతూ ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కిరణ్‌కు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ నాయకుడు అన్వర్ మాట్లాడుతూ.. ప్రాజెక్టు మొదటి సొరంగం రోడ్డులో మట్టిని తొలగించడం, ఫీడర్ కాలువ మరమ్మతులు, ఆర్అర్ ప్యాకేజీ చెల్లించడం, స్వల్పంగా పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు తక్షణమే రూ.2 వేల కోట్లు అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారన్నారు. ఈ మేరకు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చిక్కుడు రోశయ్య, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

స్పజన శీలతకు సాహిత్య అధ్యయనం ఒక్కటే మార్గం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కె.వెంకటేశ్వర రెడ్డి, మల్లిక్, మధుసూదన్

మార్కాపురం టౌన్: సృజనాత్మక నైపుణ్యాల పెంపునకు మాతృభాషే ప్రధాన ఆధారమని విద్యావేత్త, సాహిత్య విమర్శకుడు డాక్టర్ అన్నపురెడ్డి వీరారెడ్డి పేర్కొన్నారు. నిరంతర సాహిత్య అధ్యయనం, మనోవికాసానికి మాతృభాష దారిచూపుతుందని తెలిపారు. స్థానిక సాధన సాహిత్య వేదిక నెలనెలా వెన్నెల ఆధ్వర్యంలో గురువారం సాధన డిగ్రీ కళాశాలలో 61వ సాహిత్య సదస్సు నిర్వహించారు. కనిగిరికి చెందిన ప్రముఖ కవి కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి రచించిన నాగేటి గోడు దీర్ఘ కవితా పుస్తకాన్ని ఆవిష్కరించారు. పుస్తక సమీక్ష చేసిన ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మధుసూధన్ మాట్లాడుతూ.. ప్రపంచానికి అన్నంపెడుతున్న రైతులను అన్ని వ్యవస్థలు మోసం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుకు సమాజం రుణపడి ఉంటుందన్నారు. సాహిత్యంతో నా సహవాసం పుస్తకాన్ని డాక్టర్ ఎ.వీరారెడ్డి సమీక్షించారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు ఓఏ మల్లిక్, డాక్టర్ శేషుకుమార్, డి.వినోద్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌కుమార్, పవన్‌కుమార్, అకడమిక్ ఇన్‌చార్జి పీఆర్‌కే ప్రసాద్, అధ్యాపకులు శ్రీధర్, మురళి పాల్గొన్నారు.

సమస్యలపై నిలదీసిన సర్పంచులు



సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచ్‌లు

- గ్రామాల అభివృద్ధిలో నిర్లక్ష్యంపై గరం గరం
- అధికారులు హాజరుకాకపోవడంపై ఆగ్రహం

తర్లుపాడు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీపీ భూలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశం ముఖ్య అధికారుల గైర్హాజరుతో తూతూ మంత్రంగా సాగింది. గ్రామాల ప్రగతిపై చర్చించే సమావేశానికి అధికారుల గైర్హాజరు కావడంపై పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేతగుడిపి స్కూల్లో మంచి నీటి వసతి ఏర్పాటు చేసినప్పటికీ ఉపయోగించకుండా, విద్యార్థులు భోజనం చేసిన తర్వాత ప్లేట్లను ఇంటికి వెళ్లి కడుక్కోమని ఉపాధ్యాయులు చెప్పడంపై సర్పంచ్ పెద్ద మస్తాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. యూపీ స్కూల్‌గా ఉన్న పాఠశాలను ప్రైమరీ స్కూల్‌గా మార్చడానికి హెచ్ఎం నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. పనులు చేసేందుకు పంచాయతీ తీర్మానాలు తీసుకుని ప్రారంభ సమయంలో కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాడివారిపల్లి జెడ్పీ పాఠశాలలో సంవత్సరం నుండి సోషల్ టీచర్ లేకపోవడంపై సర్పంచ్ జాన్ రత్నం విద్యాశాఖ అధికారులను నిలదీశారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామంలో చెరువు కట్టను శుభ్రం చేసి, రివిట్మెంట్ చేసేందుకు సహకరించాలని కోరారు. గోకులం షెడ్లను ఏకపక్షంగా కేటాయించకుండా స్థానిక సర్పంచ్‌లను భాగస్వాములను చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తున్నారని, బిల్లులు చేయకుండా పంచాయతీ అధికారులు తిప్పుకుంటున్నారని సర్పంచ్‌లు సభ దృష్టికి తెచ్చారు. గ్రామాల్లో పొదుపు మహిళలకు రుణాలు ఇవ్వకుండా బ్యాంకుల చుట్టూ తిప్పడాన్ని ఆక్షేపించారు. వెలుగు ఏపీఎం గైర్హాజరుపై ఎంపీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు అధికారులు తీర్మానాలు చదివి వినిపించారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాటర్ డిస్పెన్సర్ బహూకరణ

పొదిలి: స్థానిక పోలీస్ స్టేషన్‌కు హమీద్ ఎలక్ట్రానిక్ షోరూం యజమాని షేక్.అబ్దుల్ హమీద్ వాటర్ కూలింగ్ డిస్పెన్సర్‌ను గురువారం బహూకరించారు. స్టేషన్ సిబ్బందితోపాటు ఫిర్యాదుదారులు తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా డిస్పెన్సర్ ఉపయోగపడుతుందని చెప్పారు. దాతను ఎస్సై వేమన అభినందించారు.

నేడు వెలుగొండలో వస్తు విక్రయ వేలం

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని పలు రకాల వస్తువులు విక్రయించుకునేందుకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి తెలిపారు. ఈ ఏడాది మార్చి 13 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా పూజా ద్రవ్యాలు, కొబ్బరికాయల విక్రయం, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునేందుకు, అలాగే బ్రహ్మోత్సవాల ముందు రోజు నుంచి మళ్లీ వచ్చే ఏడాది బ్రహ్మోత్సవాల ముందురోజు వరకు తలనీలాలు పోగు చేసుకునే హక్కు కోసం వేలం నిర్వహిస్తున్నట్లు వివరించారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.10 వేల ధరావత్తు చెల్లించాలని పేర్కొన్నారు. వేలం పూర్తయిన వెంటనే హక్కుదారులు పూర్తి మొత్తాన్ని చెల్లించాలని స్పష్టం చేశారు. వివరాలకు 80999 49996ను సంప్రదించాలని ఈఓ సూచించారు.

సిద్ధిభైరవేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి వేడుకలు

రాచర్ల: మండలంలోని గుడిమెట్ట పంచాయతీ పరిధిలోని రామాపురం గ్రామ సమీపంలో సిద్ధిభైరవేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 26న మహా శివరాత్రి తిరునాళ్ల నిర్వహించనున్నట్లు ధర్మకర్త మదిరె శ్రీరంగారెడ్డి, ఉప ధర్మకర్త శ్రీరంగపు వెంకటనారాయణరెడ్డి తెలిపారు. తిరునాళ్ల రోజు రాత్రి 8 గంటలకు తెనాలి కళాకారులతో భక్త చింతామణి నాటక ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. భక్తులకు అన్నసంతర్పణ చేయనున్నట్లు పేర్కొన్నారు.